ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 5 ఆగస్టు 2024

# అడుగడుగునా అడ్డుకట్టలు

- అడవులను తలపిస్తున్న హంద్రీ-నీవా కాలువలు
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకం.. రైతులకు శాపం
- కృష్ణా జలాల కోసం జిల్లా రైతుల ఎదురుచూపులు
- నీరొస్తే తాగునీటి సమస్య తీరుతుంది

మదనపల్లె టౌన్/ బి.కొత్తకోట/పెద్దతిప్పసముద్రం: ఆగస్టు 4: కరువు కాలంలో జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల రైతులను ఆదుకునే హంద్రీ-నీవా జలాలు వచ్చేందుకు 80 కిలోమీటర్ల పొడవునా అడుగడుగునా అడ్డుకట్టలు ఆటంకం కలిగిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో హంద్రీ-నీవా కాలువకు ఐదేళ్ల పాటు ఎలాంటి నిర్వహణ లేకపోవడంతో ఎక్కడ చూసినా కాలువకు గండ్లు పడే అవకాశం కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. దీనికి ఉదాహరణే.. ఎన్నికలకు ముందు హంద్రీ-నీవా జలాలను కుప్పం తరలించడానికి అప్పటి సీఎం జగన్ అక్కడ రిజర్వాయర్‌కు వాల్వు తిప్పిన స్టంటు అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పీటీఎం, బి.కొత్తకోట, కురబలకోట, మదనపల్లె మండలాల్లో పలుచోట్ల గండ్లు పడి నీరంతా వృథాగా వెళ్లిపోయాయి. ఈ క్రమంలో ఐదేళ్ల పాటు నిరుపయోగంగా ఉన్న హంద్రీ-నీవా కాలువకు పలుచోట్ల రైతులు వారి పొలాలకు వెళ్లేందుకు అడ్డుకట్టలు వేసి రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల ఇసుక మాఫియా ఈ కాలువలను ధ్వంసం చేసింది. ఈ క్రమంలో కృష్ణా జలాలను 15 రోజుల్లో ఈ రెండు నియోజకవర్గాలకు తరలించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండటంతో కాలువలో నీరు పారేనా అని రైతులు ఆశ, నిరాశలతో ఎదురు చూస్తున్నారు.

### అక్కడ వరదలు.. ఇక్కడ క్షామం

రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదులకు వరదలు పోటెత్తుతున్నాయి. కృష్ణా, గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నాయి. కానీ రాయలసీమంలోని అనంతపురం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మేఘాలు ఊరించి ఉస్సూరుమనిపిస్తున్నాయే కానీ పదును వాన కూడా కురవడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారిత పంట అయిన వేరుశనగ వర్షాలు లేక అంతంత మాత్రమే సాగవుతోంది. రైతులు ప్రత్యామ్నాయంగా బోర్ల కింద టమోటా పంట సాగు చేస్తున్నా వర్షాభావంతో 1000 అడుగుల లోతులో నీరు నిలిచిపోతోంది. దీంతో జిల్లాలోని తం బళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల రైతులు హంద్రీ-నీవా ద్వారా వచ్చే కృష్ణా జలాల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూ స్తున్నారు. హంద్రీ-నీవా జలాలు వస్తే మదనపల్లె పట్టణానికి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం అయి రెండు సమ్మర్‌స్టోరేజి ట్యాంకులు నిండటంతో పాటు, పట్టణంలోని తాగునీటి బోర్లలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. శ్రీశైలం జలాశయంలో వరదనీరు 834 అడుగులకు చేరగానే బ్యాక్‌వాటర్ ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ-నీవా ప్రాజెక్టుకు నీటిని మ ళ్లిస్తారు. కానీ కర్నూల్-గుంటూరు హైవే నిర్మాణంలో భాగం గా బ్రాహ్మణకొట్కూరు సమీపంలో హంద్రీ-నీవా కాలువకు అడ్డుకట్ట వేసి తాత్కాలిక డైవర్షన్ రోడ్డు వేశారు. దీంతో హం ద్రీ-నీవా జలాలకు తొలి అడ్డుకట్ట అక్కడే పడింది. దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

### తంబళపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో కూడా..

అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచి హంద్రీ-నీవా జలాలు పెద్దతిప్పసముద్రం మండలం బొంతలపల్లె వద్ద ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి పీటీఎం మండలంలో 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించి టి.సదుం వద్ద బి.కొత్తకోట మండలంలోకి కృష్ణా జలాలు ప్రవేశిస్తాయి. కానీ గతంలో హంద్రీ-నీవా జలాలను వదిలినప్పుడు మద్దయ్యగారిపల్లె వద్ద, చల్లావారిపల్లె వద్ద రెండుచోట్ల కాలువ కట్టకు గండ్లు పడి తెగిపోయాయి. కాలువలు తెగిన చోట్ల మట్టి వేసి మరమ్మతులు చేశారు. ఇదిలా ఉండగా పీటీఎం మండలంలో హంద్రీ-నీవా కాలువపై అటు, ఇటు ఉన్న పొలాలకు వెళ్లేందుకు దారి లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఐదేళ్లు కాలువలో నీరు వదలకపోవడంతో చాలాచోట్ల రైతులు హంద్రీ-నీవా కాలువలను పూడ్చి వేసి అడ్డుకట్ట వేసి దానిపై పొలాలకు దారి ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పాటు బి.కొత్తకోట మండలంలో హంద్రీ-నీవా కాలువ టి.సదుం క్రాస్ వద్ద ప్రవేశించి 23 కిలోమీటర్ల దూరం ప్రయాణించి శీలంవారిపల్లె మీదుగా కురబలకోట మండలంలోకి ప్రవేశిస్తాయి. కాగా గతంలో బి.కొత్తకోట మండలం శెట్టిపల్లె పంచాయతీ బుగ్గగడ్డ వద్ద కాలువకు రెండుసార్లు గండిపడింది. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో రైతులు పొలాలకు వెళ్లేందుకు కాలువపై తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేసుకున్నారు. కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె నుంచి కాలువ మదనపల్లె మండలంలోని కోళ్లబైలు పంచాయతీ పరిధిలో ప్రవేశిస్తుంది. అక్కడ రెండు కిలోమీటర్ల పాటు సొరంగ మార్గం ద్వారా ప్రయాణించి చిప్పిలి సమ్మర్‌స్టోరేజి ట్యాంకు, కొత్తపల్లె మీదుగా గుంటివారిపల్లె ఎస్ఎస్ ట్యాంకుకు చేరుకుంటుంది. కాగా చిప్పిలి సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేసేందుకు హంద్రీ-నీవా కాలువ అడ్డు వస్తుండటంతో ఇసుక మాఫియా ఈ కాలువను ఒకచోట ధ్వంసం చేసి దారి ఏర్పాటు చేసుకున్నారు. అలాగే వడ్డిపల్లె ప్రజలు కాలువకు అటువైపు ఉన్న పొలాలకు, శ్మశానానికి వెళ్లేందుకు కాలువలో పెద్దపైపులు వేసి దానిపై మట్టితో తాత్కాలిక దారి ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలో సుమారు 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించే కాలువలో ముళ్లచెట్లు, పొదలు విపరీతంగా మొలిచి అడవిని తలపిస్తున్నాయి. కాలువలో అడ్డుకట్టలు తొలగించి కృష్ణా జలాలు కదిలినా ఈ పిచ్చి మొక్కలు వేర్లు, తొర్రలతో నీరంతా దిగువకు వెళ్లిపోయి గండ్లు పడే అవకాశం ఉంది. ఉదాహరణకు మదనపల్లె మండలం మాదినకొండ దిగువన హంద్రీ-నీవా కాలువ కట్టకు తొర్రలు పడి నీరంతా పట్టణంలోని పుంగనూరు రోడ్డు, సత్యసాయి కాలనీలో ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కృష్ణా జలాలు అన్నమయ్య జిల్లాకు రావాలంటే హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు యుద్ధప్రాతిపదికన కాలువకు మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు అడ్డుకట్టలు తొలగించాల్సిన అవసరం ఉంది.



బి.కొత్తకోట మండలం శెట్టిపల్లె వద్ద తెగిపోయిన కాలువ కట్ట



హంద్రీనీవా కాలువ దాటేందుకు రైతులు పాతపైపులతో ఏర్పాటు చేసుకున్న నడక వంతెన



బుగ్గగడ్డ వద్ద ఆలేరువాగుపై నిర్మించిన అక్విడెక్ట్ వద్ద కట్ట తెగిపోవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేసిన దృశ్యం (లూజు మట్టికట్ట)

### జనానికి తాగునీరు.. పంటకు సాగునీరు వస్తుంది..



హంద్రీనీవా నీళ్లు వస్తే బోర్లు శాంతిస్తాయి. ఎండిపోయిన బోర్లలో నీరు పైకొస్తుంది. జనాలకు తాగే నీళ్లు వస్తాయి. సేద్యానికి కూడా నీళ్లు వస్తే కరువు కాలంలో రైతులకు ఆనందంగా ఉంటుంది. అలాగే ఈ నీళ్లతో చెరువులు నింపితే ఇంకా బాగుండు. హంద్రీనీవా నీళ్ల కోసం ఎదురుచూస్తున్నాం.

- వెంకటరమణ, రైతు, పూజార్లపల్లె, బి.కొత్తకోట మండలం

### కాలువలో నీరొస్తే మా బోర్లు సల్లగా ఉంటాయి..



హంద్రీనీవా కాలువలో నీరొస్తే మా బోర్లు సల్లగా ఉంటాయి. ఐదేండ్లుగా కాలువలో నీళ్లు రాక బోర్లన్నీ ఎండిపోయాయి, భూములన్నీ బీడ్లు పెట్టేశాము. ఇప్పుడు శ్రీశైలం నీళ్లు వస్తాయంట, ఈ నీళ్లు వస్తే ఆరునెలలు సేద్యం బాగుంటుంది. కాలువలో నీళ్లు పారేందుకు ప్రభుత్వం ఏదైనా చెయ్యాలి.

- బి.వెంకటప్ప, రైతు, పులికల్లు, పీటీఎం మండలం

## 9 నుంచి రాముడి పట్టాభిషేక మహోత్సవాలు

- టీటీడీ విస్తృత ఏర్పాట్లు



వాల్మీకిపురం, ఆగస్టు 4: వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభి రామాలయంలో ఈనెల 9వ తేదీ నుంచి టీటీడీ ఆధ్వర్యంలో రాముడి పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు తెలిపారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు భక్తులను అలరించనున్నాయి. 9న శుక్రవారం సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు సేనాధిపతి ఉత్సవం, 10వ తేదీ శనివారం ఉదయం యాగశాల పూజ, స్నపనతిరుమంజనం సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌సేవ, 6.30 గంటలకు సీతారామ శాంతి కల్యాణం, రాత్రి 8 గంటలకు హనుమంత వాహనసేన, 11న ఆదివారం ఉదయం యాగశాల పూజ, స్నపనతిరుమంజన, అనంతరం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా జరగనుంది. సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి గరుడ వాహనంపై పట్టాభిరాముడు నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. మూడు రోజుల పాటు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు అలరించనున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

## రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఆగస్టు 4: గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో రద్దీగా మారాయి. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

## మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో తహసీల్దార్ల నియామకం

మదనపల్లె టౌన్, ఆగస్టు 4: మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో పలువురు నూతన తహసీల్దార్లను నియమిస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రపోజల్స్ మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె తహసీల్దార్‌గా ఖాజాబీ, నిమ్మనపల్లె తహసీల్దార్‌గా కె.ధనంజయులు, రామసముద్రం తహసీల్దార్‌గా కె.నిర్మలాదేవి, బి.కొత్తకోట తహసీల్దార్‌గా బి.శ్రీధర్‌రావు, పీటీఎం తహసీల్దార్‌గా ఎం.శ్రీరాములునాయక్, కలికిరి తహసీల్దార్‌గా ఎస్.మహేశ్వరి బాయి, గుర్రంకొండ తహసీల్దార్‌గా సి.శ్రీనివాసులు, పీలేరు తహసీల్దార్‌గా ఎం.భీమేశ్వరరావు, మదనపల్లె సబ్‌కలెక్టరేట్ డీఏవోగా వి.పద్మావతమ్మలను బదిలీ చేశారు. వీరు ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రస్తుత ఇన్‌చార్జి తహసీల్దార్లు(డీటీ)ల నుంచి బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు మండలాలకు తహసీల్దార్‌లను నియమించాల్సి ఉంది.

## భూబాధితులకు అండగా పోరాడతాం

- భూకబ్జాలకు పెద్దిరెడ్డి నైతిక బాధ్యత వహించాలి
- 20న విజయవాడలో రెవెన్యూ భూబాధితుల సమావేశం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



రెవెన్యూ భూబాధితుల సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4: రెవెన్యూ భూబాధితులకు అండగా పోరాడతామని, రెవెన్యూ అధికారులు, భూకబ్జాదారులు కలిసి చేసిన అక్రమాలు, అవినీతి బయటపడకుండా ఉండడం కోసమే రికార్డులను తగలబెట్టారని, భూకబ్జాలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నైతిక బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని కాజ్‌భవన్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అధ్యక్షతన రెవెన్యూ భూబాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ రాజకీయ పలుకుబడితో పేదప్రజల భూములను లాక్కున్నారని, అనేకమంది పేదలు తమ భూములను బలవంతంగా, దౌర్జన్యంగా లాక్కున్నారని, మా భూములను మాకు ఇప్పించండి అని మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో భూఆక్రమణలు జరిగినట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. బాధితుల తరఫున వీటన్నింటిపై ఇదివరకే సీఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడామని తెలిపారు. బాధితులకు అండగా సీపీఐ నిలబడిందని, రెవెన్యూ బాధితులతో కలిసి ఈనెల 20వ తేదీ విజయవాడలో సమావేశం ఏర్పాటు చేసి మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతామని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ అధికారులు, భూఆక్రమణదారులు కలిసి రాజకీయ అండతో వెయ్యి ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు చెరువులు కబ్జాలు చేశారని, అవి బయటపడకుండా ఉండేందుకే ప్రభుత్వ రికార్డులను పూర్తి దహనం చేశారని తెలిపారు. అనంతరం మదనపల్లె, పీలేరు, నియోజకవర్గంలోని భూబాధితులు వారి సమస్యలను రామకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, సుధీర్‌కుమార్, మనోహర్‌రెడ్డి, సుమిత్ర, నియోజకవర్గ కార్యదర్శి మురళి, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు నాణ్యమైన సేవలందిస్తాం

- బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవి, తదితరులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 4: వైసీపీ పాలనలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యం అయిందని, రానున్న రోజుల్లో ఆర్టీసీని ప్రక్షాళన చేసి తద్వారా ప్రయాణికులకు నాణ్యమైన సేవలందిస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రధానంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలతో పాటు వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అద్దె బస్సుల సేవలను వినియోగిస్తోందని తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు నూతన గ్యారేజీ ప్రాంగణంలో కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోలకు చెందిన 18 నూతన బస్సుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి మంత్రితో పాటు కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి హాజరై రిబ్బన్ కట్ చేసి బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల వ్యవధిలోనే సుమారు 1400 కొత్త బస్సులు ఆర్టీసీ పరిధిలోకి వచ్చాయన్నారు. ఆ మేరకు ఇప్పటికే సుమారు 400 బస్సులు సర్వీసులు అందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం కడప డిపో నుంచి 18 నూతన బస్ సర్వీసులు వివిధ ప్రాంతాలకు ప్రారంభించామన్నారు. ఇందులో రెండు ఇంద్ర, ఒక సూపర్ లగ్జరీ బస్సు ఉన్నాయన్నారు. మరిన్ని కొత్త బస్సులను ఆర్టీసీ ద్వారా కొనుగోలు చేసి మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మన జీవితంలో ఆర్టీసీ బస్సు ఒక భాగమన్నారు. గ్రామాలకు సైతం బస్సులు నడుస్తున్నాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కొత్త బస్సుల ప్రారంభోత్సవానికి కడప బస్టాండుకు వచ్చిన మంత్రికి ఆర్టీసీ కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, బద్వేల్, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ నాయకులు విజయమ్మ, భూపేశ్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, ఆర్టీసీ యూనియన్ల నాయకులు కె.కె. కుమార్, ఏ.ఆర్.మూర్తి, జయరాం, ఆర్టీసీ ప్రైవేట్ అద్దె బస్సుల సంఘం అధ్యక్షుడు పాలగిరి భాస్కర్, కార్యదర్శి గరుడాద్రి, కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరభద్రుడి అమావాస్య పల్లకీ ఉత్సవం



రాయచోటిటౌన్, ఆగస్టు 4: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో ఆదివారం అమావాస్య పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి అభిషేకాలు, వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో పల్లకీ ఉత్సవంపై ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వెలిగల్లు కుడి కాలువకు నీటిని విడుదల చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- రైతులకు సమాచారం ఇవ్వని అధికారులపై మండిపాటు



వెలిగల్లు జలాశయం నుంచి కుడికాలువకు నీటిని విడుదల చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఆగస్టు 4: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని వెలిగల్లు జలాశయం నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేశారు. మండలంలో పర్యటించిన ఆయన వెలిగల్లు జలాశయం వద్ద కొబ్బరికాయలు కొట్టి కుడికాలువ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలోని రైతాంగాన్ని, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సాగు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వెలిగల్లు జలాశయం నుంచి రైతుల పంట పొలాలకు నీటిని అందించి ఆదుకుంటామని తెలిపారు. మారుమూల గ్రామాలకు తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అయితే నీటి విడుదల విషయం మండల ప్రజలకు, రైతులకు సమాచారం ఇవ్వకపోవడం వల్ల ఆగ్రహించిన మంత్రి ప్రాజెక్టు అధికారుల తీరు మారకపోతే పరిస్థితి భిన్నంగా ఉంటుందని డీఈ, ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వెలిగల్లు జలాశయంలో 2.77 టీఎంసీల నీరు ఉందని, ఇందులో ప్రస్తుతం కుడికాలువకు 30 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయని, తర్వాత 50 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తామని, ఇలా 90 రోజుల వరకు నీటిని విడుదల చేస్తామని ప్రాజెక్టు డీఈ శిరీష్‌కుమార్ మంత్రికి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈ సాంబశివుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## యజమానికి టోకరా వేసి నగదు అపహరణ

- దొంగలను పట్టుకున్న పోలీసులు

కురబలకోట, ఆగస్టు 4: యజమానికి టోకరా వేసి నగదును దోచుకున్న దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. ఆదివారం మండలంలోని అంగళ్లు ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడతూ బెంగళూరుకు చెందిన ప్రదీప్ మిక్చర్ వ్యాపారం చేస్తూ తన వాహనంలో కడప, ప్రొద్దుటూరు, బద్వేల్, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో సరుకును తన డ్రైవర్ ద్వారా సరఫరా చేసేవాడు. కాగా యజమాని వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకటేష్ తన యజమానికి చెందిన డబ్బులు కొట్టేయాలని పథకం పన్నాడు. చిక్‌బళాపూర్ జిల్లా చిల్లగట్టుతాలూకాకు చెందిన వెంకటేష్, గిరీష్, మురళీధర్, నాగరాజు మరో యువకుడు మధుతో కలిసి వెంకటేష్ తన యజమానికి చెందిన డబ్బు కొట్టేయడానికి ప్లాన్ చేశాడు. గత నెల 23న బెంగళూరు నుంచి కడపకు వెళ్లి సరుకులను వేసి కలెక్షన్‌తో తిరిగి వస్తూ పథకం ప్రకారం తానా మిట్ట వద్దకు రాగానే తన స్నేహితులు వచ్చి రూ.1.50 లక్షల నగదును తీసుకెళ్లారు. కానీ తన యజమానికి మాత్రం తన కారును ఎవరో అడ్డగించి నగదు దోచుకెళ్లారని తెలపడంతో ముదివేడు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో డ్రైవర్ వెంకటేశ్ తానే డబ్బులు కొట్టేసినట్లు ఒప్పుకోవడంతో అతడి వద్ద నుంచి రూ.1.40 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

# 'వైసీపీ' నిర్లక్ష్యం రైతులకు శాపం


లైనింగ్‌కు నోచుకోని వెలిగల్లు కుడికాల్వ

లైనింగులకు నోచుకోని ప్రధాన కాల్వలు ● గతేడాది వృధాగా పోయిన నీళ్లు
● సొంత డబ్బుతో పిల్లకాల్వలు తవ్వుకున్న రైతులు
● చివరి ఆయకట్టు వరకు నీరు పారడం ప్రశ్నార్థకం

గాలివీడు, ఆగస్టు4: వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం రైతుల పాలిటి శాపంలా పరిణమించింది. ఐదేళ్ల వైసీపీ పాలన లో ఉన్న నీటిని కూడా రైతులు ఉపయోగించుకోలేని దుస్థితి దాపురించింది. ప్రధాన కాల్వలకు లైనింగ్ లేకపోవడంతో గతేడాది నీళ్లన్నీ ఏటి పాలయ్యాయి. 'అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని ఉన్న' చందంగా వెలిగ ల్లు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పరిస్థితి తయారైంది. వెలిగల్లు మూడు మండలాల రైతులకు గుండెకాయ లాంటి ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎందరో రైతులు తమ భూములను త్యాగం చేశారు. కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. అయితే రైతులకు కలుగుతున్న ప్రయోజనం అంతంత మాత్రమేనని చెప్పవచ్చు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఉన్న నీటిని వినియోగించుకోలేక పోవడానికి కారణంగా ప్రధాన కాల్వలకు లైనింగ్ లేకపోవడాన్ని చెప్పవచ్చు. ఫలితం గా వేలాది ఎకరాల వ్యవసాయ భూములు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. రాయ చోటి నియోజకవర్గంలోని గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో 24 వేల ఎకరాలకు సాగు నీరు, లక్ష జనాభాకు తాగునీరు అందివ్వాలనే ఆశయంతో గాలివీడుకు సమీపంలోని పాపాఘ్ని నదిపై వెలిగల్లు ప్రాజెక్టు ను చేపట్టారు. 2003-04లో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 4.64 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసి 2008 డిసెంబర్ 22న రైతులకు అంకితం చేసింది.

## పాలకుల నిర్లక్ష్యం - రైతులకు శాపం

వెలిగల్లు ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాల్వలున్నాయి. కుడికాల్వ గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల పరిధిలోని 52 కిలోమీటర్ల పొడవునా 23,400 ఎకరాలకు సాగునీరు అందించనుంది. ఎడమకాల్వ వెలిగల్లు, తూముకుంట పంచాయతీలో 10 కిలోమీటర్ల పొడవునా 600 ఎకరాలకు సాగునీరు అందించనుంది. అయితే ఐదేళ్లలో వెలిగల్లు ప్రాజెక్టు పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరిని అవలంబించినట్లు స్పష్టంగా తెలుస్తోంది గతంలో ప్రాజెక్టులో నీళ్లున్నా వాటిని వ్యవసాయ భూములకు అందించ లేకపోయారని ఆరోపణలున్నాయి. ప్రాజెక్టు కాల్వలకు లైనింగ్‌లు వేయకపోవడం వల్ల నీళ్లన్నా జల్లెడ మాదిరి కారి తిరిగి ఏటికి చేరుకున్నాయి. కుడికాల్వకు 10 కిలోమీటర్ల మేర లైనింగ్ ఉన్నా మిగతా కాల్వకు లైనింగ్ లేకపోవడం వల్ల నీరంతా వృధాగా కారిపోయింది. కాల్వలకు వదిలిన నీటిలో 25 శా తం కూడా కాల్వ చివరికి చేరకపోవడం చూస్తే కాల్వల పరిస్థితి ఎలాఉందో అర్థమవుతోంది. ముఖ్యంగా మండల పరిధిలోని గుండ్లచెరువు పంచాయతీలోని కొంత భాగం, పందికుంట, కొర్లకుంట పంచాయతీల్లో వెళుతున్న కాల్వలో ఎక్కువగా నీరు కారిపోతున్నాయి. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో వెళుతున్న కాల్వకు లైనింగ్‌లు లేకపోవడంతో నీరు వృధాగా కారిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటి ప్రభుత్వ మైనా వెలిగల్లు కాల్వలకు మరమ్మత్తులు చేపట్టి చివరి ఆయకట్టుకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

## మరమ్మతుకు నోచుకోని పిల్లకాల్వలు

వెలిగల్లు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద 143 కిలోమీటర్ల పిల్లకాల్వలున్నాయి. ఈ పిల్ల కాల్వలు ప్రస్తుతం మట్టి, బండరాళ్లు, చెట్లతో నిండిపోయా యి. వీటిగుండా నీళ్ల పారే పరిస్థితిలేదని రైతులు వివరిస్తున్నారు. ప్రధాన కాల్వల కింద తక్కువ భూమి సాగులోకి వస్తుందని, కానీ పిల్ల కాల్వల కింద అధిక విస్తీర్ణంలో సాగుభూమి ఉందన్నారు. ఒక గుత్తేదారు కాల్వలను తవ్వకుండా తవ్వినట్లు రూ.8 కోట్లు బిల్లులు చేసుకున్నాడని ఆయన నిర్ల క్ష్యంతో కొన్ని భూములకు నీళ్లు అందలేదని పలువురు రైతులు ఆరోపించారు. కొందరు రైతులు సొంత డబ్బుతో పిల్లకాల్వను తవ్వుకుని వ్యవసాయం చేసుకున్నట్లు తెలిపారు.


చెట్లు, రాళ్లతో నిండిన పిల్ల కాల్వలు


లైనింగ్ లేక కాల్వ కింద వృథాగా కారుతున్న నీరు (ఫైల్‌ఫొటో)

## బీడుగా వ్యవసాయ భూములు

వెలిగల్లు కాల్వలకు లైనింగ్ వేయకపోడం, పిల్ల కాల్వలకు మరమ్మత్తులు చేయకపోవడం వల్ల కాల్వ లో నీరు పారే పరిస్థితి తక్కువ. తద్వారా వ్యవసాయ భూములన్నీ బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన కాల్వ, పిల్లకాల్వలు సక్రమంగా ఉండి ఉంటే ఈ పాటికే కాల్వలకు నీరు వదిలి ఉండేవారని, తద్వారా భూములన్నీ పాడి పంటలతో కళకళలాడుతూ ఉండేవని పలువురు రైతులు పేర్కొన్నారు. తీవ్ర వర్షాభావం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కాల్వలకు నీళ్లవదిలి ఆదుకోవాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వెలిగల్లు కాల్వల దుస్థితిపై ప్రాజెక్టు డీఈ శరీఫ్ కుమార్‌ను వివరణ కోరడానికి ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

## సొంత డబ్బుతో కాల్వలు తవ్వుకున్నాం



వెలిగల్లు ప్రాజెక్టు కుడికాల్వ మా గ్రామానికిపైన వెళుతోంది. అయితే నీరు పారే భూములు తక్కువ. గతేడాది పిల్లకాల్వలు మట్టి, చెట్లతో పూడిపోయాయి. రైతులంతా కొన్ని పిల్లకాల్వల్లోని మట్టిని, చెట్లను తొలగించారు. కొన్నింటిని సొంత డబ్బుతో ఎక్స్‌కవేటర్లు పెట్టుకుని తవ్వుకున్నాము. ఈ ఏడాది కూడా పిల్లకాల్వలు చెట్లు, రాళ్లతో పూడిపోయాయి. ప్రభుత్వం స్పందించి పిల్లకాల్వలకు మరమ్మత్తులు పనులు చేపట్టాలి.

మహేశ్వర్‌రెడ్డి, నాయునివారిపల్లె, కొర్లకుంట

# టీచర్ల పనిసర్దుబాటు నిలిపివేయాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 4: జీఓ117 ఆధారంగా టీచర్లను పనిసర్దుబాటు చేయడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని, వెంటనే పదోన్నతులు చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం కలిగించే జీఓ 117ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చెప్పిన విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ అదే జీఓ 117 ఆధారంగా టీచర్ల సర్దుబాటు చేయడం ఏ మాత్రం సమంజసంకాదన్నారు. పదిమందిలోపు విద్యార్థులున్న ధార్మిక పాఠశాలలు మూసివేయాలని విద్యాశాఖాధికారులు చెబుతున్నారని పాఠశాలలను మూసివేయడం వల్ల పేద బలహీన వర్గాలకు చెందిన పిల్లలు విద్యకు దూరమవుతారన్నారు. తక్షణం ఈ ఆలోచన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు క్రిష్ణారెడ్డి, గురయ్య, భాస్కర్‌రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాలజోజి, అబ్దుల్‌సత్తార్ పాల్గొన్నారు.

# మహిళ అనుమానాస్పద మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి

ఎర్రగుంట్ల, ఆగస్టు 4: ప్రకాష్‌నగర్‌కు చెందిన లక్ష్మీసునీత(30) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. లక్ష్మీసునీతకు హిందూపురం వాసి నరసింహులుతో సుమారు 15 ఏళ్లక్రితం వివాహమైంది. అయితే వారు ఎర్రగుంట్లకే వచ్చి కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 3గంటలకు ఆమె ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. విషయం తెలుసుకున్న ఎర్రగుంట్ల ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి 8వ తరగతి చదివే కుమారుడు, 6వ తరగతి చదివే కుమార్తె ఉన్నట్లు సమాచారం.

# ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు


రాష్ట్ర పోటీలకు ఎంపికైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో పీడీ, పీఈటీలు

రాయచోటిటౌన్, ఆగస్టు 4: అన్నమయ్య జిల్లా కేంద్రం మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని పులివెందుల, జమ్మలమడు గు, వేముల కొత్తపల్లి, రైల్వేకోడూరు, పుల్లంపేట, రాయచోటి, సుండుపల్లె, మైదుకూరు, ఆగుడూరు, కోరకుంటపల్లి, ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచీ సుమారు 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఎంపికలను కడప జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జాయింట్‌సెక్రటరీ జేసునాథరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, ఆర్గనైజర్, సెలెక్షన్ సెక్రటరీ జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17, 18, 19వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొంటారన్నారు. ఈ ఎంపికలకు జిల్లా అసోషియేషన్ సభ్యులు గంగులయ్య, వివిధ పాఠశాల పీడీ, పీఈటీలు రవీంద్రరాజు, సుబ్రమణ్యం, వెంకట్రమణ, రవీంద్రనాధరాజు, అబ్దుల్‌కరీం, గంగాశిరీష, చంద్రావతి, నీలకంఠ, సీనియర్ క్రీడాకారులు నాగార్జున, శ్రీను, కార్తీక్, శివ తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌లకు ఆకతాయిల నిప్పు


కాలిపోయిన వాహనాలు

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 4: స్థానిక శ్రీనగర్ కాలనీలో ఇంటి ముందు నిలిపి వుంచిన రెండు బైక్‌లకు అకతాయిలు నిప్పు పెట్టారు. వాహనాల యజమాని రఘునాయుడు తన ఇంటి ముందు వాహనలను పార్కింగ్ చేశారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు కాల్చినట్లు రూరల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.


# కాల్వల్లో పూడిక - రోడ్లపైకి మురికి నీరు

మెరుగు పడని పారిశుధ్య సేవలు ● వార్డుల్లో పట్టించుకోని శానిటరీ సెక్రటరీలు


రోడ్డు పైకి చేరిన కాల్వల్లో నీరు

ప్రొద్దుటూరు ఆగస్టు 4: వీధికాల్వల్లో పారిశుధ్య కార్మికులు పూడికతీత పనులు చేపట్టకపోవడం వలన మురికి నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. ముఖ్యంగా వార్డు స్థాయిలో పారిశుధ్య సేవలు మెరుగుపడడం లేదనే విమర్శలున్నాయి. ప్రజలు కాల్వలపై బండలు వేసి కాంక్రీట్ ర్యాంపులు వేయడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కాల్వల్లో చెత్తా చెదారం, మట్టి పూడిక తీయలేని పరిస్థితులు వున్నాయి. అంతేకాకుండా ఇంటింటికీ చెత్తసేకరణ పనులు చాలా వార్డుల్లో పూర్తి స్థాయిలో సాగడం లేదు. రెండేళ్లుగా చెత్త ఆటోలు వీధుల్లో తిరిగి ఇంటింటి చెత్త సేకరాంచేవి. ప్రసుత్తం 35 ఆటోలకు కేవలం 15 ఆటోలు మాత్రమే వార్డుల్లో చెత్తను సేకరించడం వలన కూడా వీధుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్త కాల్వల్లో పడి మురుగు ప్రవాహం ముందుకు సాగక మురికి కొన్నిప్రాంతాల్లో రోడ్ల మీదికి ప్రవహిస్తున్నాయి. దీనికి తోడు 45 సచివాలయాల్లో వున్న శానిటరీ సెక్రటరీల పర్యవేక్షణ అంతంత మాత్రమే. వీరు పారిశుధ్య పనులు చేపట్టడం తమ విధులు కావని కొందరు సచివాలయాలకే పరిమితం అవుతున్నారు. కొందరు సెక్రటరీలు ఉదయాన్నే పారిశుధ్య కార్మికులకు మస్టర్ వేయడానికి రావడం లేదు. మరికొందరు వార్డుల్లో పనులు పర్యవేక్షించకుండా గంట అరగంట పాటు వుండి వారి సొంత పనులు చూసుకుంటున్నారు. కొందరు పర్మినెంటు కార్మికులను మేస్త్రీలుగా డిప్యుటేషన్‌పై విధులు అప్పగించినా వారూ సక్రమంగా పని చేయడంలేదని ఆరోపణలున్నాయి. వీరు మేస్త్రీలుగా డిప్యూటేషన్ కోసం అధికారులకు మామూళ్లు ఇవ్వడం వలన తాము పారిశుధ్య పనులు పర్యవేక్షించడం కంటే డబ్బు సంపాదన పనిలోవున్నట్టు ఆరోపణలున్నాయి. ఒక వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టరు లేకపోవడం వలన ఇన్‌చార్జుగా మరో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టరును పెట్టడంతో రెండు డివిజన్లు పర్యవేక్షణ చేయలేక ఇబ్బందిగా మారింది. దీనికితోడు పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లు గ్యాంగ్ వర్కులు చేపట్టడంతో ఆపనుల పర్యవేక్షణ కూడా కొరవడు తోంది. ముఖ్యంగా మున్సిపాలిటీ శానిటేషన్‌కు అసిస్టెంట్ కమిషనర్ లేకపోవడం వలన కమిషనరే అన్నీ పర్యవేక్షించడం భారంగా మారింది. కొంతకాలంగా అసిస్టెంట్ కమిషనర్ మేనేజర్ పోస్టులు సైతం ఖాళీగా వున్నాయి. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మున్సిపాలిటీలో ఖాళీల భర్తీకి ఉన్నతాధికారులకు తెలిపి త్వరిగతిన బదిలీపై అధికారులను తెప్పించుకుంటే పరిపాలన గాడిలో పడుతుంది.

# 'మామిడి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోండి'


తెగి పడిపోయిన మామిడి చెట్లు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4: మామిడి చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు బద్వేలు మండలం కోనసముద్రం వాసి మల్లేశ్వర్‌రెడ్డి భార్య రాజమ్మ బ్రహ్మంగారి మఠం మండలం రేకలకుంట్ల పంచాయతీ సర్వేనెం.814/2, 814/1లలో నాలుగెకరాల పొలం కౌలుకుంది. ఇందులో 200 మామిడి చెట్లు నాటుకుని జీవనం సాగిస్తోంది. కాగా ఆదివారం తెల్లవారుజామున బద్వేలు టౌన్ ఫాతిమానగర్‌కు చెంది న కొందరు తమ పొలంలోకి వచ్చి పొలం మాది, మీకు ఏ విధంగా వస్తుందని కొట్లాడి 200 మామిడి చెట్లను నరికివేశారని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో తమకు ఐదులక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈవిషయమై ఎస్‌ఐ విద్యాసాగర్ మాట్లాడుతూ అక్రమంగా మామిడి చెట్లు నరికిన వారిపై చర్యలు చేపడతామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అనాథ బాలికలకు రూ.లక్ష సాయం


కర్నూలులో అనాథ బాలికలకు ఆర్థిక సాయం అందిస్తున్న కోడూరు నూర్ బాషా సంఘం

రైల్వేకోడూరు, ఆగస్టు 4: జిల్లా నూర్ బాషా సంఘం ఆధ్వర్యంలో అనాధ బాలికలకు ఆర్థిక సాయం అందించారు. కర్నూలు జిల్లా హాలహర్వి మండలం గూల్యం వాసులు పి.కాసీంసాబు,షేకమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుమార్తెలు ఆశాబి, నబియా, ఆఫ్రీన్ అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు నూర్ బాషా సంఘం రూ.లక్ష ఆర్థిక సాయం అందించింది. అధ్యక్షుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ తల్లిదండ్రులు మృతి చెందడంతో ఆడ పిల్లలకు జీవనాధారం లేకపోవడంతో రైల్వేకోడూరు నూర్ బాషా సంఘం విరాళాలు సేకరించి ఆర్థికసాయం అందించారన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా నూర్ భాషా సంఘం అధ్యక్షుడు పి. మస్తాన్, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పగిడాల సిద్ధయ్య, జిల్లా నూర్ బాషా సంఘం అధ్యక్షుడు నడిగడ్డి ఇమాములు తదితరులు పాల్గొన్నారు.

# రెండు బైక్‌లు ఢీ - ఒకరి మృతి

మృతుడు కడప జిల్లా వాసి ● మరో ఇద్దరికి గాయాలు


ఉపేంద్రవర్మ మృతదేహం

హంకుంపేట, ఆగస్టు 4: గడుగుపల్లి సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా సిహెచ్.ఉపేంద్రవర్మ (44) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లాకు చెందిన సిహెచ్.ఉపేంద్రవర్మ ఆదివారం ఉదయం అరకు నుంచి నుంచి పాడేరు వస్తున్నారు. గడుగుపల్లి వద్ద హంకుంపేట మండలం పాతకోట వాసులు రామన్న, చందు బైక్‌పై వస్తూ ఢీకొన్నారు. దీంతో ఉపేంద్రవర్మ బైక్ నుంచి కిందికి జారిపడి స్పృహకోల్పోయారు. సంఘటనా స్థలంలో నే మృతి చెందారు. రామన్న, చందు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు సంఘట నా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఉపేంద్ర కుటుంబీకులకు సమాచారం అందించారు. రామన్న, చందు స్థానిక ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు.

# నైపుణ్యాలపై శిక్షణ


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

వేంపల్లె, ఆగస్టు 4: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఆదివారం ట్రిపుల్‌ఐటీలోని సీఎస్ఈ డిపార్ట్‌మెంట్‌లో పైతాన్ ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ వర్క్ షాప్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ సతీష్ బృందం ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు.

కార్యక్రమానికి డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో రూ.లక్ష ఆస్తి నష్టం



సుండుపల్లె, ఆగస్టు 4: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రూ.ఒక లక్ష ఆస్తి నష్టం జరిగిందని వినాయక నగర్ వాసి రెడ్డెప్పఆచారి తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున మొదటి అంతస్తు బాడుగ ఇంటికితాళాలు వేసి పనుల నిమిత్తం బయటికి వెళ్లగా షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని సామాగ్రి అంతా కాలిపోయిందన్నారు. ఫ్రిడ్జ్, కూలర్, బీరువా అందులోని పట్టుచీరలు సుమారు రూ.20 వేలు నగదు మండలకు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.ఒక లక్ష ఆస్తినష్టం జరిగినట్టు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులకు స్థానికులు తెలియజేశారు.

# కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి


కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

పెండ్లిమర్రి, ఆగస్టు 4: తుమ్మలూరు పంచాయతీ గోపరాజుపల్లెలో కుక్కల దాడిలో 15గొర్రెలు మృతిచెందాయి. అదే గ్రామానికి చెందిన పంగా భైరేష్‌కుచెందిన ఐదుగొర్రెలు, పంగా ఈశ్వరయ్య ఐదు గొర్రెలు, పంగాగణేష్‌కు చెందిన ఐదు గొర్రెలపై శనివారం రాత్రి కుక్కలు దాడి చేసి చంపాయి. దాదాపు రూ.1.50లక్షలు ఉంటుందని తెలిపారు. ఒక ఏడాది ఆదాయం నష్టపోయామని, గొర్రెల పెంపకమే జీవనాధారం అని మా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులను కోరారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 4: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్లు, మండలాల ప్రజలు వారి సమస్యలను తెలియజేసేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు రావాల్సిందిగా వారు తెలియజేశారు.

## 250 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 4: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, రాయచోటి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నలంద హైస్కూల్‌లో 250 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదిశ్రీ రవీంద్ర పర్యవేక్షణలో జరిగాయి. ఈ సందర్భంగా కంటి ఆపరేషన్ అవసరమైన 50 మందికి 6వ తేదీన ఉచిత వాహనంలో తిరుపతి అరవింద్ ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించి అదే వాహనంలో ఇంటి వద్ద చేరుస్తామని తెలిపారు. కాగా కంటి బాధితులకు, ఆసుపత్రి సిబ్బందికి శివారెడ్డి, వీరనాగిరెడ్డిలు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వంశీక్రిష్ణ, గౌరిశంకర్, మానవతా చైర్మన్ బాలసుబ్రమణ్యం, కమిటీ సభ్యులు ప్రసాద్‌యాదవ్, రామాంజనేయులు, లయన్స్ క్లబ్ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, రమణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## రూ.15 వేలు ఆర్థిక సహాయం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 4: మండలంలోని పాశెంగొల్లపల్లె పంచాయతీలోని బర్జుపల్లెకు చెందిన చిన్నకొండు సుదర్శన్ అడవిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కాగా జాండ్రపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 1991లో 10వ తరగతి చదివిన బ్యాచ్, స్నేహితుల దినోత్సవం సందర్భంగా మృతుడు సుదర్శన్‌కుటుంబాన్ని పరామర్శించి మృతుని భార్య, పిల్లలకు రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంతేకాకుండా ఏ అవసరమొచ్చినా తాము అండగా ఉంటామని తెలియజేశారు. రామాంజనేయులు, బాలక్రిష్ణ, రామ్మోహన్, ఇస్మాయిల్, ముబారక్, లక్ష్మిరెడ్డి, ఆదిరెడ్డి, రాజా, హరిప్రసాద్‌లు ఉన్నారు.

## ఆటో యూనియన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెనగలూరు, ఆగస్టు 4: ప్రభుత్వం ఆటో యూనియన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వైచలపతి, ఇ.సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాదాసు గంగాధర్ అధ్యక్షతన బెస్తపల్లె కూడలిలో ఆటో కార్మికులకు జరుగుతున్న సమస్యల గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యకర్తలు జిల్లా కార్యదర్శితో పాటు పలు సమస్యల గురించి ప్రస్తావించి ప్రభుత్వం ద్వారా వాటిని పరిష్కరింపజేయాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెస్తపల్లె కూడలిలో ఆటోలను నిలుపుకునేందుకు స్టాండ్ చూపించి సీరియల్‌లో ఆటోలు నిలుపుకునేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు

- రూ.67 లక్షలతో వినాయకుడి మంటపం, కోనేరు
- 7వ తేది నుంచి పూజా కార్యక్రమాలు
- 9న విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి వినాయకస్వామి దేవాలయం, వినాయకస్వామి మండపం

పెనగలూరు, ఆగస్టు 4: మండల కేంద్రంలోని పి.కొత్తపల్లె గ్రామ నడిబొడ్డున దాదాపు రూ.కోటి రూపాయలతో కార్యసిద్ధి వినాయకస్వామి ఆలయం, కోనేరు, మంటపం నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 7వ తేది నుంచి ఘనంగా ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. హైదరాబాదులో నివాసం ఉంటున్న పి.కొత్తపల్లె వాసి తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.17 లక్షలతో వెంగగురుస్వామి కోనేరు, రూ.50 లక్షలతో వినాయకుని మండపం నిర్వహిస్తున్నారు. దీనికి తోడు గ్రామస్తుల విరాళాలతో రూ.37 లక్షలు వెచ్చించి కార్యసిద్ధి వినాయకస్వామి దేవాలయం నిర్వహించారు. వేదపండితులచే శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు.



పునర్నిర్మించిన వెంగగురుస్వామి కోనేరు

### పూజా కార్యక్రమాల వివరాలు

ఈ నెల 7న దేవాలయ ప్రాంగణంలో ప్రాతఃకాల పూజా కార్యక్రమాలు ప్రారంభం అనంతరం యాగశాల నిర్వహించబడుతుంది. 8న యాగశాల అనంతరం మూలవిరాట్, ఉత్సవమూర్తుల కలశం, మకర తోరణాలు, కంచు గంటలను గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. 9న యాగశాల, విగ్రహ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత కార్యసిద్ధి వినాయకుని కల్యాణోత్సవం ఉంటుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు.

# మాది సేవ చేసే ప్రభుత్వం

- ఉద్యోగస్తులు పనిచేయకుంటే ఊరుకోను
- సర్వసభ్య సమావేశంలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఆగస్టు 4: తమ ప్రభుత్వం కక్షపూరితం కాదని, ప్రజలకు సేవచేసే ప్రభుత్వమని రాష్ట్ర యువజన, రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సభాభవనంలో ఎంపీడీవో పీడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి ఆయా శాఖల పనితీరు, అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరుపేదల ఇళ్ల నిర్మాణంలో హౌసింగ్ అధికారులు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారని, హౌసింగ్, రెవెన్యూలో జరిగిన అవినీతి ఇంతా అంతా కాదని, నిరుపేదల కుటుంబాల జీవితాలతో ఆడుకున్నారన్నారు. అధికారులు ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న 900 గృహాలకు పాత బిల్లులు చెల్లించి పూర్తి చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గృహాలకు ఇచ్చిన రూ.1.80 లక్షల కంటే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం సీఎం చంద్రబాబునాయుడు రూ.4 లక్షలు ఇవ్వనున్నారని తెలిపారు. ప్రస్తుత నూతన గృహ నిర్మాణాలను ప్రభుత్వం అమలు చేయనున్న విధి విధానాలను అనుసరించి పారదర్శకంగా చేపట్టాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలకు మోడల్ స్కూల్ ఏర్పాటు చేసినప్పటికీ అతి పెద్ద మండలమైన గాలివీడు మండలంలో మోడల్ స్కూల్ లేకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. వెంటనే మోడల్ స్కూల్ ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఆడబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాలుగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అవినీతి, అక్రమాలకు తావులేకుండా మెనూ ప్రకారం చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో సిబ్బందిని ఆదేశించారు. కాగా గత ప్రభుత్వంలో పూలుకుంట సచివాలయాన్ని బోరెడ్డిగారిపల్లెకు తరలించారని స్థానిక సర్పంచ్ పార్థసారధిరెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో అసైన్డ్ భూముల పేరిట రెవెన్యూ అధికారులు చేసిన అక్రమ వసూళ్లపై మంత్రి తీవ్రంగా స్పందించారు. అంతేకాకుండా ఇక నుంచి ప్రతి రెవెన్యూ కార్యాలయం ఎదుట ఫిర్యాదు బాక్సులను పెడతామని హెచ్చరించారు. సమావేశంలో భూ సమస్యలపై చర్చిస్తూ శాశ్వత పరిష్కారం కోసం ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను చరవాణిలో సంప్రదిస్తూ అవసరమైతే గత ప్రభుత్వ అవినీతిపై ప్రత్యేక విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పరిషత్ సభాభవనంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, హౌసింగ్ పీడీ సాంబశివయ్యతో పాటు అన్నిశాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**రామాపురం:** శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీలోని బీసీ కాలనీ, కొత్తపల్లె గ్రామాల్లో ఆదివారం రక్షిత మంచినీటి పథకాన్ని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాధరెడ్డితో కలిసి ప్రారంభించారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు, శివారెడ్డిల సొంత నిధులతో ఆ గ్రామాలకు మంచినీటి రక్షిత పథకం ద్వారా బోరు వేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, దేరంగుల శ్రీనివాసులు, చిలేకాంపల్లె శివారెడ్డి, మండల టీడీపీ నాయకుడు అంజనారెడ్డి, గడికోట భాస్కర్‌రెడ్డి, రమణయ్యయాదవ్, శివశంకర్‌రెడ్డి, గడికోట ఆంజనేయరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, గోవిందరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలు టైలరింగ్‌లో రాణించాలి : ఎమ్మెల్యే

రైల్వేకోడూరు, ఆగస్టు 4: మహిళలు టైలరింగ్‌లో రాణించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని గిరిజాలేన్‌లో గ్లోబుల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ పి.పార్థసారథి ఆధ్వర్యంలో 100వ బ్యాచ్ ఉచిత టైలరింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబుల్ సర్వీస్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు సాగుతున్నాయని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలన్నారు. మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఆర్థికంగా ఎదిగేందుకు ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం మగ్గం కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతురాజు నవీన్, శిక్షకులు భావన, పాలెంకోట పద్మావతి, పవిత్రి, హరిక తదితర మహిళలు పాల్గొన్నారు.

**ఓబులవారిపల్లె:** మండలంలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలోని జ్ఞానపంపల్లి హరిజనవాడకు చెందిన టీడీపీ కార్యకర్త బొమ్ము చందు అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డిలు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఒక మంచి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు.

### కూటమి నాయకులతో సందడి



కూటమి నాయకులతో ఎమ్మెల్యే శ్రీధర్, రూపానందరెడ్డిలు

మండలంలోని బాలిరెడ్డిపల్లె గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు కూటమి నాయకులు హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, జనసేన నాయకుడు జోగినేని మణి, పగడాల సోదరులు మండల టీడీపీ నాయకులు పున్నాటివాసుదేవరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. అనంతరం గ్రామంలో కూటమి నాయకులు, గ్రామ ప్రజలతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వై.కోట మాజీ సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ తిరుపాల్, వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ అధ్యక్షుడు రవికుమార్‌రాజు, గుండయ్యనాయుడు, రమణారెడ్డి పాల్గొన్నారు.

**పుల్లంపేట:** మండల పరిధిలోని రంగంపల్లె పంచాయతీ అరుంధతివాడలో తాగునీటి సమస్య ఉండడంతో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆదివారం కొత్తబోరు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ఎమ్మెల్యేతో, ముక్కా సాయివికాస్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీకే వెంకటసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

## వాహనాలు ఢీ

చిట్వేలి, ఆగస్టు 4: మండలంలోని నేతివారిపల్లె వద్ద ఆదివారం అరటికాయల లోడుతో వెళ్తున్న వాహనం, ప్రయాణికులతో వెళ్తున్న జీపు ఎదురెదురుగా వెళ్తూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదు. కాగా చిట్వేలి-కోడూరు రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు విస్తరణ పనులు వేగంపెంచి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

## సుప్రీంతీర్పు ఎమ్మార్పీఎస్ విజయం



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజంపేట, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎమ్మార్పీఎస్ నాయకుల విజయమని ఎమ్మార్పీఎస్ న్యాయ సలహాదారు సురేష్ రాజు తెలిపారు. మండల పరిధిలోని డీబీఎస్ పల్లెలో ఆదివారం అభినందనసభ నిర్వహించారు. గ్రామ పెద్దలు ఎమ్మార్పీఎస్ నాయకులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వెలగచర్ల శివయ్యమాదిగ, న్యాయ సలహాదారు లాయర్ సురేష్‌రాజు, బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర నాయకుడు టి.హరిప్రసాద్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చేమూరి వెంకటేశ్, జిల్లా నాయకులు మందా శివయ్య, మందా రవి, ఎమ్మార్పీఎస్ నాయకుడు పెంచలయ్య, వడ్డెర, ఎంఈఎఫ్ నాయకులు బి.చంద్రశేఖర్, జె.జయకుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనాదిగా సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న మాదిగ సామాజిక వర్గాన్ని ఉద్ధరించేందుకు మందకృష్ణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి కేవలం మాదిగలకేగాక అనేక పోరాటాలతో దివ్యాంగుల సామాజిక పింఛన్, ఆరోగ్యం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు సాధించి పెట్టారని తెలిపారు. అయినా మాదిగలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడే ఉన్నారని, వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కాలంటే వర్గీకరణ ద్వారానే సాధ్యమన్నారు. విద్యతోనే అజ్ఞానాన్ని తొలగించుకుని ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యావంతులు కావాలని తెలియజేశారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నారాయణ, బాలనరసయ్య, హరికృష్ణ, సుబ్బరాయుడు, నరసింహులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

రాజంపేటటౌన్, ఆగస్టు 4: ఆశా కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి.సుభాషిని, జిల్లా ఇన్‌ఛార్జి గుంటి వేణుగోపాల్‌లు డిమాండ్ చేశారు. రాజంపేట ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల ఆశా కార్యకర్తల సమావేశం రత్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సుభాషిని, జి.వేణుగోపాల్‌లు మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆశా, అంగన్వాడీ కార్యకర్తలపై జరుగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, కోకన్వీనర్ సరోజలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.రాధాకృష్ణ, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.గంగాధర్, అన్నమయ్య జిల్లా యూనియన్ కార్యదర్శి రాజన్న, భాగ్యమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన టీడీపీ నాయకుడు



సీఎంతో మాట్లాడుతున్న రమేష్‌బాబు

రైల్వేకోడూరు, ఆగస్టు 4: సీఎం చంద్రబాబును ఆదివారం విజయవాడలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, దళిత నాయకుడు పుల్లెల రమేష్‌బాబు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. పెనగలూరు లిఫ్ట్ ఇరిగేషన్, అప్పా జ్యూస్ పరిశ్రమ, కోడూరు-వెంకటగిరి రోడ్డు, నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు, ఉద్యాన పరిశ్రమలు, మైనింగ్ యూనివర్శిటీ తదితరవి కావాలని విన్నవించామని తెలిపారు. దళితులు నియోజకవర్గంలో చాలా వెనకబడి ఉన్నారని, వారికి చేయూత కావాలని కోరామన్నారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. టీడీపీ నాయకులు శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కురవాలని గంగమ్మకు పూజలు

- 101 బిందెలతో అమ్మవారికి అభిషేకం



అలంకరణలో గంగమ్మ తల్లి

వీరబల్లి, ఆగస్టు 4: వర్షం కురవాలని గ్రామస్తులు గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా 101 బిందెలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వర్షం కురిసి కరువు పోయేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మల్లికార్జునలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ మహిళా నేత



సునీతను అభినందిస్తున్న మంత్రి

రాజంపేటటౌన్, ఆగస్టు 4: కేంద్ర మంత్రిగా తొలిసారిగా తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన భారీ పరిశ్రమలశాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌శర్మను బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సునీత నారాయణవర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం పలు అంశాలపై ఆయనతో చర్చించినట్లు తెలిపారు. ఇందుకు స్పందిస్తూ తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు.

# చౌడేశ్వరి జయంతి సందర్భంగా అన్నదానం





రాజంపేటలో అన్నదానం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, గాలివీడులో అలంకరణలో గ్రామ దేవత

రాజంపేట, ఆగస్టు 4: వీరచౌడేశ్వరిదేవి జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాజంపేటలోని పాతబస్టాండులో ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ తొగటవీర క్షత్రియులకు ముఖ్యంగా అమ్మవారి భక్తులకు ఎంతో పవిత్రమైన రోజు అన్నారు. చౌడేశ్వరీ అమ్మవారి జయంతిని ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. భక్తులందరిపైన అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని, అమ్మవారి చల్లని చూపులు భక్తులందరిపై ఉండాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.సూర్యచంద్ర, పార్లమెంట్ నాయకుడు తోట నగేష్, బీజేపీ ఓబీసీ మోర్చ ఆర్టీఐ సెల్ కన్వీనర్ పి.మహేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**గాలివీడు:** కలియుగంలోని దుష్టులను శిక్షించడానికే చౌడేశ్వరి అమ్మవారు ఆషాఢమాష అమావాస్య రోజున ఆవిర్భవించారని వేదపండితులు సుబ్రమణ్యశర్మ పేర్కొన్నారు. ఆదివారం ఆషాఢ అమావాస్య అమ్మవారి జయంతి సందర్భంగా పూలికుంట గ్రామంలో వెలసిన అమ్మవారి దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ ఆదిపరాశక్తి చౌడేశ్వరిమాత పూలికుంట గ్రామంలో భక్తుల కోరిన కోర్కెలు తీరుస్తూ ప్రజల కొంగు బంగారంగా విరాజిల్లుతోందన్నారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**రామాపురం:** మండలంలోని సుద్దమల్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో ఆదివారం చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, స్వస్తివాచకం, మహావిష్ణుపూజ, పంచామృతాభిషేకం, తొగటవీర క్షత్రియులు ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొని ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌లకు పట్టుచీరలతో అలంకరించి బంగారు నగలు అలంకరించారు. అనంతరం వచ్చిన భక్తులకు, మహిళలకు మంగళ హారతులు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భజనలు, గ్రామోత్సవాలను అమ్మవారికి నిర్వహించారు.

**సిద్దవటం:** మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట గాండ్లవీధిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారికి గ్రామ ప్రజలు, భక్తులు ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారి గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకునేందుకు సిద్దవటం నుంచి కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.



ఆక్రమిత చెరువులో వృక్షాల నరికివేతతో మిగిలిన కలప - చెరువులో వృక్షాలు నరికివేయగా మిగిలిన మొదళ్లు (ఇన్‌సెట్లో)



ఆక్రమణ కోసం తాజాగా చదును చేసిన స్థలం

# చెరువును చెరబట్టారు!

**సగినేకుప్పంలో ఆక్రమణలను అడ్డుకున్న గ్రామస్తులు ● సర్వే చేపట్టి సరిహద్దుల్లో కందకాలు తవ్వితేనే రక్షణ**



ఆక్రమణల బారి నుంచి కాపాడాలంటూ చెరువు వద్దకు చేరుకున్న సగినేకుప్పం, పరిసర గ్రామాల ప్రజలు

రామకుప్పం, ఆగస్టు 4: రామకుప్పం మండలం బందార్ల పల్లె పంచాయతీ సగినేకుప్పం చెరువును అక్రమార్కులు చెరబట్టారు. రామకుప్పానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సర్వేనెంబరు 31లోని ఈ చెరువు విస్తీర్ణం 23.43ఎకరాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. దశాబ్దకాలంగా ఎక్కడికక్కడ చెరువు ఆక్రమణలకు గురయ్యింది. దీంతో చెరువు విస్తీర్ణం కుచించుకుపోయింది. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం ఆక్రమణలు పోనూ 14ఎకరాలు మాత్రమే ఉంది. తాజాగా ముద్దనపల్లెకు చెందిన ఒకరు శనివారం రాత్రికిరాత్రే ఎక్స్‌కవేటర్లతో రెండు ఎకరాల మేర చెరువు భూమిని చదును చేసేశాడు. ఆ భూమిలోని భారీ వృక్షాలను పెకలించి, తరలించేశాడు. ఆదివారం ఈ విషయం తెలిసి సగినేకుప్పం, పరిసర గ్రామాల ప్రజలు చెరువు వద్దకు చేరుకున్నారు. సదరు వ్యక్తిని చెరువు భూమి ఆక్రమణపై నిలదీశారు. రికార్డుల మేరకు తమకు చెందిన భూమినే చదును చేసుకున్నామని అతడు బుకాయించాడు. దీంతో రైతులు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చెరువును సర్వే చేయిస్తామని అంత వరకు ఆ భూమిలో ఎటువంటి సాగు చేయరాదని చెప్పడంతో అతడు వెళ్లిపోయాడు. గతంలో అధికారుల నిర్లక్ష్యంతో చెరువు నలువైపులా ఆక్రమణలకు గురైంది. ఉన్నతాధికారులు స్పందించి చెరువును సర్వే చేయించి, సరిహద్దుల్లో కందకాలు తవ్వించి, చెరువు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు, ఆగస్టు 4: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

● చిత్తూరు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉంటుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు.

## కుక్కల దాడిలో జింక మృతి



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 4: కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన ఆదివారం చిత్తూరు జింకల పార్కు సమీపంలో చోటు చేసుకుంది. అటవీ శాఖ తూర్పు విభాగం కార్యాలయం పక్కనే ఉన్న జింకల పార్కు నుంచి ఓ జింక దారి తప్పి సమీపంలోని వీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడి కుక్కలు మూకుమ్మడి దాడి చేయడంతో మృతి చెందింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది జింకకు అక్కడే పంచనామా చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

## నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4: జిల్లాలో 2014-15 నుంచి 2018-19 వరకు నిర్వహించిన ఉపాధి హామీ, నీరు-చెట్టు, ఎస్డీఎఫ్ బిల్లులకు సంబంధించిన రూ.120 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జిల్లా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్ కోరారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులు సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌ల సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం మళ్లించిన గ్రామ పంచాయతీల నిధులను విడుదల చేయాలని కోరారు. తగు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. పంచాయతీ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షులు వై.వినోద్ రాజు, గోగినేని వసుధ పాల్గొన్నారు.

## ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. విజయపురంలో 12.6, నగరి 4.8, నింద్ర 4.2, గంగవరం 3.8, పెనుమూరులో 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

## జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యంశర్మ

నగరి ఆగస్టు4: చిత్తూరు ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరి లయన్స్ క్లబ్, చదరంగం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ప్రారంభించిన విశ్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం శర్మ మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ చదరంగం పోటీలు మేధస్సును పెంచుతాయన్నారు. గ్రామీణ స్థాయిలో పోటీలను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి జూనియర్ విభాగంలో 126మంది, సీనియర్ విభాగంలో 24 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ రామచంద్రారెడ్డి, జోన్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, మాజీ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షులు గజేంద్ర, సభ్యులు దేవన్, జీవన్, మహ్మద్, రవికుమార్, శివకేశవులు, ఖలీల్‌బాషా, సత్యానందం పాల్గొన్నారు.

## కుప్పం రైల్వే స్టేషన్‌లో రెండో టికెట్ కౌంటర్ నిర్మాణం



రెండవ ప్లాట్ ఫామ్‌వైపు శరవేగంగా నిర్మాణమవుతున్న అదనపు కౌంటర్

కుప్పం, ఆగస్టు 4: కుప్పంలో రైల్వే ప్రయాణికుల కష్టాలు కొంతమేర త్వరలోనే తీరబోతున్నాయి. రెండవ అదనపు టికెట్టు కౌంటర్ నిర్మాణం శరవేగంగా నిర్మాణం అవుతుండడమే దీనికి కారణం. కుప్పం రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్ ఫామ్‌లు ఉన్నాయి. ఒకటి జోలారుపేట నుంచి బెంగళూరు మీదుగా వెళ్లే రైల్వే ప్రయాణికుల కోసం నిర్మాణమైన మొదటి ప్లాట్ ఫామ్. మరొకటి బెంగళూరు వైపునుంచి జోలారుపేట వైపు వెళ్లేది. మొదటి ప్లాట్ ఫామ్ కుప్పం నేతాజీ రోడ్డు వైపు ఉన్నది. ఆర్టీసీ బస్టాండుతోటు పట్టణంలోని ప్రధాన భాగమంతా ఇటువైపే ఉండడంతో ఈ ప్లాట్ ఫామ్ మీదనే ఎప్పటినుంచో టికెట్ కౌంటర్ నిర్వహిస్తున్నారు. పేరుకు రెండు కౌంటర్లు ఉన్నా సరే, ఇందులో ఒకే కౌంటర్ వినియోగంలో ఉంది. రెండవ కౌంటర్‌ను ఎప్పుడూ మూతవేసి ఉంటారు. ఉన్నది ఒకే కౌంటర్ కావడంతో ఎప్పుడూ దీనివద్ద ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రైలు వచ్చే సమయం దాటిపోతున్నా, ప్రయాణికులు టికెట్టు కౌంటర్ క్యూలోనే ఉండాల్సిన పరిస్థితి. అంతేగాక జోలారుపేట నుంచి బెంగళూరు వైపు వెళ్లే రైళ్లలో ప్రయాణించాల్సిన వారు పట్టణంవైపు ఉన్న టికెట్టు కౌంటర్‌లో టికెట్లు తీసుకుని అటు రెండవ ప్లాట్ ఫామ్ మీదికి వెళ్లాల్సి ఉంటుంది. రెండు ప్లాట్ ఫామ్‌ను కలుపుతూ రైల్వే పట్టాల మీదుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ మధ్యనే లిఫ్ట్ సౌకర్యం కూడా ఈ బ్రిడ్జి మీదికి ఏర్పాటు చేశారు. అయితే కొంతమంది ఆకతాయిలు ఈ లిఫ్ట్‌ను మధ్యలోనే ఆపేస్తుండడంవల్ల ప్రయాణికులు భయపడి, మెట్లమీదుగానే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదికి చేరుకోవాల్సి వస్తోంది. పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఈ మెట్లను ఎక్కడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ టికెట్టు కౌంటర్ వద్ద రద్దీ వల్ల ఆలస్యం అవడంవల్లనో లేదా ఏదో పనివుండి చివరి నిముషంలో రైల్వే స్టేషన్‌కు రావడంవల్లనో రైలు వచ్చేస్తుందన్న తొందరలో ప్రయాణికులు టికెట్టు తీసుకున్న తర్వాత మొదటి ప్లాట్ ఫామ్ నుంచి రెండవ ప్లాట్‌ఫామ్‌కు పట్టాలమీదుగానే దాటుతున్నారు. ఈ సమయంలో రైలు ఢీకొని మరణాలు సంభవిస్తున్నాయి. ఈ సమస్యపై అనేకమార్లు రైల్వే అధికారులకు ఫిర్యాదులు అందాయి. రెండవ ప్లాట్‌ఫామ్‌పై అదనపు కౌంటర్ నిర్మిస్తే కొత్తపేట వైపు ఇంకా అటు వైపు ఉన్న గ్రామీణ ప్రజలు ఈ కౌంటర్‌లో టికెట్టు కొని అటునుంచి అటే రైలు ఎక్కే వీలుందని వినతులు వెళ్లాయి. ఇన్నాళ్లకు ఈ ఫిర్యాదులు, వినతుల పట్ల రైల్వే శాఖలో కదలిక కనిపిస్తోంది. కొత్తపేట వైపు ఉన్న రెండవ ప్లాట్ ఫామ్‌ను ఆనుకుని అదనపు కౌంటర్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కౌంటర్ మాత్రమే కాదు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం మరో నిర్మాణం చేస్తున్నారు. ఈ రెండు నిర్మాణాలు పూర్తయి వినియోగంలోకి వస్తే కుప్పంలోని సగభాగంలో ఉన్న ప్రజల సమస్య తీరుతుంది. పట్టాలు దాటే అవసరం తగ్గి, ఆమేరకు రైలు ప్రమాద మరణాలు అదుపులోకి వస్తాయి. రెండవ ప్లాట్ ఫామ్‌పై అదనపు కౌంటర్‌తోపాటు ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం షెడ్డు నిర్మాణం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గంగమ్మ దర్శనానికి క్యూలో వేచియున్న భక్తులు

## బోయకొండలో భక్తుల రద్దీ



చౌడేపల్లె, ఆగస్టు4: బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఆషాడమాస చివరి ఆదివారం కావడంతో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

# ప్రజల సొమ్ముతో వైసీపీ నాయకుల జల్సాలు

● తిరుపతి కార్పొరేషన్‌లో రూ.3కోట్ల స్కామ్

● పనిచేయకనే 90మందికి జీతాల చెల్లింపు: జనసేన

తిరుపతి (జీవకోన), ఆగస్టు 4: ప్రజల సొమ్ముతో గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు జల్సాలు చేశారని తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మండిపడ్డారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి కార్పొరేషన్‌లో రూ.3కోట్లు స్నాక్స్ స్కామ్ జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో అన్నీతానై వ్యవహరించిన అప్పటి డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, వైసీపీ కార్పొరేటర్లు ప్రజలకు చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపుడో ఓసారి మీటింగ్ పెట్టుకుని రూ.3కోట్లు స్నాక్స్ రూపంలో ఖర్చు పెట్టారని స్వయానా వైసీపీ కార్పొరేటర్లే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కొందరేమో రూ.38లక్షలు అంటారు.. మరికొందరు అధికారులేమో రూ.1.50 అంటారు.. మొత్తానికి రూ.3కోట్లు సమోసాల పేరుతో తినేశారని ఆరోపించారు. మరోపక్క 90మందిని కార్పొరేషన్‌లో నియమించుకున్నట్లు తప్పుడు లెక్కలు చూపి వారికి 25 నెలల పాటు జీతాల పేరుతో సొమ్మును దిగమింగారని చెప్పారు. మనుషులే పనిచేయని చోట జీతాలు ఎలా చెల్లించారంటూ ప్రశ్నించారు. కార్పొరేషన్‌లోని ప్రతి అధికారి ఇంట్లో ఇద్దరు మనుషులను పెట్టుకుని వారి సొంత పనులకు వినియోగించుకుని ప్రజల సొమ్ముతో జీతాలు చెల్లించారన్నారు. అదే విధంగా డబుల్ డెక్కర్ బస్సును రూ.2కోట్లు పెట్టి కొనుగోలు చేశారని.. ప్రస్తుతం ఆ బస్సు గోవిందధామం పక్కన పాత వాహనాల మధ్యలో పెట్టేశారన్నారు. ఈ బస్సు కోసం నగరంలోని పచ్చని చెట్లను సైతం నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వినోద్, సుమన్‌బాబు, కిషోర్, మనోజ్, ఆది, పవన్, సుమంత్, రాజేంద్ర, సిద్ధు, లోకేష్, భాను తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్





గ్యాలరీలను పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

## శ్రీవారి మాడవీధుల్లో తనిఖీలు

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం తనిఖీ చేశారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో మాడవీధుల్లో ఉన్న వివిధ ప్రవేశ, నిష్క్రమణ, హారతి పాయింట్ల గురించి తెలుసుకోవడానికి అన్ని గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.వాహన మండ పం నుంచి ప్రారంభమై నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలు, తిరుమలనంబి ఆలయం వద్ద కదిలే వంతెన,గ్యాలరీల వద్ద ప్రవేశ నిష్క్రమణ పాయింట్లు, ఇతర సంబంధిత సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో నందకిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ముక్కంటి రాహు-కేతు పూజల్లో రికార్డు

**ఆదివారం ఒక్కరోజే 9,168 టిక్కెట్ల విక్రయాలు**

శ్రీకాళహస్తి, ఆగస్టు 4: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాహు-కేతు పూజల సంఖ్య ఆల్‌టైం రికార్డుగా నమోదైంది. ఆలయంలో ఐదు రకాల ధరల టిక్కెట్లపై వేర్వేరుగా రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు జరిగే విషయం తెలిసిందే. 14 నెలల కిందట ఐదు రకాల టిక్కెట్లు 7,200 అమ్ముడు కావడం రికార్డుగా నమోదైంది. తాజాగా ఆషాడ అమావాస్య ఆదివారం కలిసి రావడంతో ఈ ఒక్కరోజే 9,168 రాహుకేతు పూజా టిక్కెట్లు అమ్ముడై సరికొత్త రికార్డుగా నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముక్కంటి ఆలయంలోని రాహుకేతు మండపాలు భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి.

**ఐదు రకాల టిక్కెట్ల వివరాలిలా..**

రూ.500 టిక్కెట్లు 5,183, రూ.750.. 2,288, రూ.1,500.. 933, రూ.2,500.. 610, రూ.5వేల టిక్కెట్లు 154 కలిపి మొత్తం 9,168 రాహుకేతు పూజలు జరిగినట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అలాగే ఐదు రకాల ప్రసాదాలు 29,505 ప్యాకెట్లు విక్రయం జరగడంతో ఈ సంఖ్య కూడా రికార్డుస్థాయికి దగ్గరగా నమోదైంది. కాగా, ఆదివారం ఒక్కరోజే వివిధ పూజలు, సేవలు టిక్కెట్ల ద్వారా ఆలయానికి రూ.1,95కోట్లు వచ్చిందని ఈవో చెప్పారు.



రూ.500 రాహు-కేతు పూజ మండపం వద్ద బారులు తీరిన భక్తులు

## ఆటో ఢీకొని పలువురికి గాయాలు

నిమ్మనపల్లి, ఆగస్టు 4: ఆటో ఢీ కొనడంతో పలువురికి గాయాలు కాగా, బాధితుడు నరసింహులు పిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ రవి(40)పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెడ్డివారిపల్లి పంచాయతీ ఎనుగొండ పాలేనికి చెందిన నరసింహులు పొలం నుంచి వస్తుండగా కొత్తచెరువు సమీపంలో ఆటో ఢీకొంది. వెంటనే ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో మరో ఇద్దరికి గాయాలయ్యాయి.. దీంతో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## భూతగాదాలో ఒకరికి..

నిమ్మనపల్లి, ఆగస్టు 4: వేర్వేరు ప్రాంతాల్లో భూమి విషయంలో జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి కథనం మేరకు నల్లంవారిపల్లిలో ఎల్లారెడ్డికి చెందిన భూమిని రమేష్ అనే వ్యక్తి అక్రమించుకోవడంతో ఎల్లారెడ్డి సర్వేకు దరఖాస్తు చేసుకొన్నాడు. రమేష్ అతని వర్గీయులు సర్వేను అడ్డుకోవడమే కాకుండా ఎల్లారెడ్డిపై కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. దీంతో రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

**గుర్రంకొండ:** ఇంటి స్థలం విషయమై గొడవపడడంతో ఇద్దరికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మండలంలోని తరిగొండకు చెందిన ప్రకాశ్ కుమార్‌కు బీసీ కాలనీలో ఇంటి స్థలం ఉండేది. ఈ స్థలాన్ని ఆయన అన్న మునిరాజ రామాపురానికి చెందిన శ్రీనివాసులకు అమ్మేశాడు. ఈ విషయంలో కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ప్రకాశ్‌కుమార్, గురుస్వామి ఆదివారం శ్రీనివాసులను నిలదీశారు. దీంతో వివాదం పెరిగి గొడవపడ్డారు. ఈ గొడవలో శ్రీనివాసులు కర్ర, ఇటుక రాళ్లతో ప్రకాశ్‌కుమార్, గురుస్వామిపై దాడి చేశాడు. ఈ దాడిలో ప్రకాశ్‌కుమార్, గురుస్వామి గాయపడడంతో కుటుంబ సభ్యులు వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఫిర్యాదు స్వీకరించి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ద్విచక్రవాహనాలు ఢీకొని ఐదుగురికి..

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 4: వేర్వేరు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. రంగసముద్రం గ్రామం కుర్రావాండ్లపల్లె కు చెందిన కొత్తోళ్ల రామచంద్ర (65) ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోటకు వెళుతుండగా బి.కొత్తకోటకు చెందిన బీబీజాన్(45) తమ కుమారుడు సాధిక్ అలీ(20)తో కలిసి మొలకల చెరువు మండలం పెద్ద పాళెం వెళుతూ రాహురివాండ్లపల్లె ఏటి వద్ద ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రామ చంద్రకు, బీబీజాన్‌కు, సాధిక్ అలీకి స్వల్ప గాయాల య్యాయి. స్థానికులు 108 వాహనంలో బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రామచంద్రను మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.



రామచంద్రకు ప్రథమ చికిత్స చేస్తున్న దృశ్యం

**గుర్రంకొండ:** మండలంలోని అరిగెలవారిపల్లెకు చెందిన వెంకటరమణ తన కుమారుడు సాయిగణేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో గుర్రంకొండ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ఇంద్రిగలోని పెట్రోల్ బంకు వద్ద మహ్మద్ అలీ(21) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటరమణ (53)కు కుడి కాలు విరగగా, సాయిగణేష్(13)కు రక్తగాయాలయ్యాయి. పోలీసులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో రైతుకు..

ములకలచెరువు, ఆగస్టు 4: ద్విచక్రవాహనాన్ని ఐషర్ ఢీకొనడంతో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రం పంచాయతీ కాయలవాండ్లపల్లెకు చెందిన రైతు లక్ష్మీనారాయణ(46) శనివారం సాయంత్రం ములకలచెరువు మండీకి టమోటాలు తీసుకొచ్చాడు. టమోటాలు అమ్ముకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళు తుండగా ములకలచెరువు మండలం బత్తలాపురం క్రాస్ వద్ద కదిరి వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతోపాటు ద్విచక్రవాహనాన్ని కిలో మీటరు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## పోస్టుమార్టం ఆలస్యంపై బాధితుల ఆగ్రహం



ప్రభుత్వాస్పత్రి ఆవరణలో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతురాలి కుటుంబీకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 4: పోస్టుమార్టం ఆలస్యం చేయడంతో బాధితులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో చరణ్, నందినిల కుమార్తె రూప(2) ట్రాక్టర్ ఢీ కొట్టడంతో మృతి చెందింది. దీంతో శనివారం రాత్రి మృతదేహాన్ని మదనపల్లె సర్వజన బోధనాసత్రికి తరలించారు. కాగా, తంబళ్లపల్లె పోలీసులు సకాలంలో రాలేదని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు మాట్లాడుతూ ఈ కేసు ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని కోరినా తంబళ్లపల్లె ఎస్ఐ స్పందించలేదన్నారు. పోస్టుమార్టం ఆలస్యానికి పోలీసులే కారణమన్నారు. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. చివరికి మధ్యాహ్నం మూడు గంటలకు చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేశారు.

## మృతదేహాల సమాచారంతో పోలీసుల హైరానా

బి.కొత్తకోట, ఆగస్టు 4: గుర్తు తెలియని మృతదేహాలను పూడ్చిపెట్టారన్న సమాచారంతో పోలీసులు హైరానా పడ్డారు. మండలంలోని మొటుకు గ్రామశివారులో రెండుశవాలను ఖననం చేశారని, దుర్వాసన వస్తోందని ఓ వ్యక్తి పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఏఎస్ఐ బొజ్జేనాయక్ సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ చేశారు. అయితే అక్కడ ఖననం చేసింది ఆవుల కళేబరాలని గ్రామస్తులు తెలపడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# ఘనంగా చౌడేశ్వరీ దేవి జయంతి ఉత్సవాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు4: చౌడేశ్వరి జయంతి సందర్భంగా స్థానిక నీరుగట్టువారిపల్లె, కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువు మిట్ట ఆలయాల్లో ఆదివారం ఉదయాన్నే చౌడేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కోళ్లబైలులో అమ్మవారిని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. నీరుగట్టువారిపల్లెలో ఎమ్మెల్యేకు ఆలయకమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. తొగటవీర క్షత్రియ యువజన సంఘం అధ్యక్షుడు ఉప్పు శ్రీని వాసులు, ఉపాధ్యక్షుడు దీపక్, ట్రెజరర్ నరసింహులు, సెక్రటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అన్నదానం చేశారు. సాయంత్రం చౌడేశ్వరిని ప్రత్యేక వాహనంలో ఆసీనురాలిని చేసి ఊరేగించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి బండి పవన్‌కుమార్, ట్రెజరర్ రామిశెట్టి రత్నమయ్య, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. మాజీ కౌన్సిలర్లు బండి నాగరాజ, నీలకంఠ, రామిశెట్టి చంద్రశేఖర్, ఆంజనేయులు, సొసైటీ రామచంద్ర,వార్డన్ వెంకటేష్, లక్ష్మీనారాయణ, యర్రబల్లె వెంకటరమనారెడ్డి, బిల్డర్ రామకృష్ణ, నాగార్జున బాబు, జేసీబీ మధు, మోడెం శిద్దప్ప, కమలమరి కృష్ణ, బీజేపీ వెంకటేష్, పురాణం వెంకటరత్నం, ప్రభాకర్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

**తంబళ్లపల్లె:** మండలంలోని పరుసతోపు పంచాయతీ బురుజులో గ్రామస్తులు, తొగటవీర క్షత్రియులు చౌడేశ్వరి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయాన్నే అమ్మ వారిని విశేషంగా అలంకరించి పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరాలు, దూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాల్లో ప్రత్యేకాలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

# పెద్దిరెడ్డికి చట్ట ప్రకారం బుద్ధి చెబుతాం..

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కురబలకోట, ఆగస్టు 4: వైసీపీ హయాంలో పెద్దిరెడ్డి చేసిన అరాచకాలకు చట్ట ప్రకారం బుద్ధి చెబుతామని ప్రకారం రాష్ట్ర రవాణా, క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని అంగళ్ళు పాత బస్టాండ్ కూడలిలో టీడీపీ. జనసేన, బీజేపీ సానుభూతి పరుల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్, వంగవీటి రంగా విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇదే రోజున, ఇదే సర్కిల్‌లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, టీడీపీ నేతలపై దాడులు చేసి వారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. అలాంటి ఈ సర్కిల్‌లో విగ్రహాలను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. భూకబ్జాలకు పాల్పడి పేదలు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నవారెవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేస్తారన్నారు. అలాంటి వారు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నాయకులు సుబ్రమణ్యం, జయచంద్రరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు చినబాబు, టీజేపీ పార్లమెంటరీ అధ్యక్షుడు సాయి లోకేష్, టీఎస్ఎన్వీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొర స్వామి నాయుడు, మల్లికార్జుననాయుడు, టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి త్యాగరాజు, జనసేన నాయకులు రాందాస్‌చౌదరి, సాయినాథ్, మనోజ్, అశోక్ పేర్కొన్నారు.



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

# టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం..

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఆగస్టు 4: టీడీపీ కార్యకర్తలందరికి అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక సుభాష్ రోడ్డులోని ఎమ్మెల్యే నివాసం వద్ద మూడు మండలాలు, పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 15 ఏళ్లుగా టీడీపీ నాయకత్వం లేకపోవడంతో కార్యకర్తలు ఎన్నో అవమానాలు, అక్రమ కేసులు ఎదుర్కొన్నారన్నారు. ప్రతి మండలంలో విడివిడిగా సమావేశాలు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటామన్నారు. సరిగ్గా ఏడాది క్రితం అంగళ్లలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుపై వైసీపీ నాయకులు రాళ్ల దాడి చేశారని గుర్తుచేశారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చారు, ఆయన అనుకుంటే ఆ నాటి ఘటనలో నిందితులను ఇప్పటికిప్పుడే వెంటనే అరెస్టు చేయించవచ్చన్నారు. కాని సీఎం చంద్రబాబు సంయమనం పాటిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు తేలిన వైసీపీ నాయకుల భూకబ్జాలు కేవలం 10శాతమే అని ఇంకా 90శాతం భూకబ్జాలు బయటపడతాయన్నారు. టీడీపీ కార్యకర్తలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వారికి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఉద్యోగాలు ఇస్తామని, దీంతో పాటు రూ.10కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రోడ్ల పనులను కార్యకర్తలకు అప్పగిస్తామన్నారు. నాణ్యతగా పనిచేసి వారి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కొంత మంది వైసీపీ నాయకులు తనతో మాట్లాడుతున్నారే కాని, తాను మొదటి ప్రాధాన్యత టీడీపీ నాయకులకే ఇస్తానన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ పటిష్టతకు పనిచేయాలని, ఇక్కడ గ్రూపులు లేవన్నారు. మదనపల్లెకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి విన్నవించామన్నారు. హౌసింగ్ కాలనీలో, టిడ్కో ఇళ్లను మరో రెండు నెలల్లో చంద్రబాబు చేతుల మీదుగా అప్పగిస్తామన్నారు. వైసీపీ నాయకుల కబ్జాలను అడ్డుకుని, పేదల భూములను తిరిగి వారికే అప్పగిస్తామన్నారు. ఈ సమావేశంలో టీ ఆర్‌జే వెంకటేష్, ఎస్‌ఏ మస్తాన్, విద్యాసాగర్, నాగార్జునబాబు, షంషీర్, బాబా ఫక్రుద్దీన్, జేవీ రమణ, సుధాకర్, ప్రభాకర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలు,నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

# ముమ్మరంగా జనసేన సభ్యత్వ నమోదు

మదనపల్లె అర్బన్, ఆగస్టు4: స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో జనసేన మదనపల్లె నియోజకవర్గ నేత శ్రీరామరామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన మదనపల్లె నియోజకవర్గ నాయకుడు శ్రీరామ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు జగదీష్‌బాబు, సోను, అశోక్, నవాజ్, హర్ష, సోము, శంకర్, చలపతి, లీలాకర్, నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

**బి.కొత్తకోట:** బి.కొత్తకోట పట్టణంలో జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరిగింది. ఆ పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ షాకీర్‌బాషా ఆధ్వర్యంలో జ్యోతిసర్కిల్‌లో పలువురిని సభ్యులుగా చేర్చుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేషస్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్‌బాషా, ఖలీల్, ప్రసాద్, నాగేంద్ర, సుధాకర్, రోహిత్, ప్రశాంత్, రాజా, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం ఇస్తున్న జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు

## రెగ్యులర్ ఎస్‌ఐని నియమించండి

పెద్దమండ్యం, ఆగస్టు 4: పెద్దమండ్యం పోలీసు స్టేషన్‌లో రెగ్యులర్ ఎస్‌ఐను నియమించాలని మండల ప్రజలు కోరారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పెద్దమండ్యం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన చెన్నకేశవ ఎన్నికల తరవాత సెలవుపై వెళ్లారు. తరవాత మదనపల్లి రూరల్ ఎస్‌ఐ రవికుమార్ ఇన్‌చార్జ్‌గా వచ్చారు. ఆ తరవాత రాయచోటి దిశ విభాగం ఎస్‌ఐ చలపతి ఇన్‌చార్జ్ గా పని చేసి వెళ్లి పోయారు. ప్రస్తుతం తంబళ్లపల్లి ఎస్‌ఐ శివకుమార్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఎస్‌ఐల తీరు అలా వుంటే పోలీసు స్టేషన్‌ను సిబ్బంది కొరత వేడిస్తోంది. ఈ స్టేషన్‌లో ఒక ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 21 మంది పోలీసు సిబ్బంది ఉండాల్సి ఉండగా, స్టేషన్‌లో ఆరుగురు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు సమాచారం. మిగిలిన వారు అటాచ్ డ్యూటీలు, ఇద్దరు సస్పెన్షన్‌లో ఉన్నట్లు తెలిసింది. పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పెద్దమండ్యంకు రెగ్యులర్ ఎస్‌ఐని నియమించాలని ప్రజలు కోరారు.

## వైసీపీ కార్యకర్త కిడ్నాప్, విడుదల

పీలేరు, ఆగస్టు 4: ఓ వైసీపీ కార్యకర్త కిడ్నాప్‌కు గురైన సంఘటన ఆదివారం పీలేరు, కేవీపల్లెల్లో కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు కేవీపల్లె మండలం వగళ్ల గ్రామానికి చెందిన తువ్వపల్లె తారకనాథ రెడ్డి(32)ని ఆదివారం సాయంత్రం పీలేరులో గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేశారనే పుకార్లు వ్యాపించాయి. దీంతో పీలేరు పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే రాత్రి 8 గంటల సమయంలో గొల్లపల్లె చెరువులో ఓ వ్యక్తి రక్తగాయాలతో ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రహీముల్లా నేతృత్వంలో అక్కడికి వెళ్లిన పోలీసులు గాయపడిన వ్యక్తిని తారకనాథరెడ్డిగా గుర్తించి, పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పీలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# 'సంజీవిని'తో మహిళల్లో కేన్సర్ నివారణకు కృషి

పీలేరు, ఆగస్టు 4: 'సంజీవని ఉమెన్ హెల్త్‌కేర్' పేరిట వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ మహిళల్లో కేన్సర్ నివారణకు కృషి చేస్తున్నట్లు కేవీపల్లెలోని శ్రీశ్రీనివాస చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రవీంద్రనాథ రెడ్డి తెలిపారు. కేవీపల్లె మండలం లక్ష్మిరెడ్డిగారిపల్లెలో ఆదివారం ఉచిత కేన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో తమ సంస్థ కేవీపల్లె, కలికిరి, కలకడ మండలాల్లోని మహిళల్లో సర్వైకల్ కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ, దాని బారిన పడిన వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సాయం అందిస్తున్నట్లు వివరించారు. అంతకు మునుపు ఆయన కేవీపల్లె మండలం జాండ్రపేటలోని పశువైద్యశాలకు జంతు పరీక్ష బోనును అందజేశారు. లక్ష్మిరెడ్డిగారిపల్లెలో జరిగిన వైద్య శిబిరానికి 198 మంది మహిళలు హాజరు కాగా నిర్వాహకులు 80 మందికి ఉచితంగా పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, సభ్యులు డా.బ్రహ్మారెడ్డి, గైనకాలజిస్టులు విద్య, సృజన, తేజ, జిలాని, షమీమ్, ప్రోగ్రాం వలంటీర్లు శ్రీనివాస్ రెడ్డి, ఆదినారాయణ, రామాంజనేయులు, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




వైద్య శిబిరంలో మాట్లాడుతున్న రవీంద్రనాథరెడ్డి

## అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కురబలకోట, ఆగస్టు 4: అప్పుల బాధ తాళలేక ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని ముదివేడు పంచాయతీ పడమటి హరిజనవాడకు చెందిన మారెప్ప కుమారుడు వెంకటరమణ(35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను కుటుంబ పోషణ నిమిత్తం పలువురి వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిళ్ళు అధికమయ్యాయి. దీంతో మనస్తాపం చెంది నాటుసారాలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ముదివేడు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎలక్ట్రానిక్స్, టీవీ మెకానిక్‌లు సంఘటితం కావాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4: టెక్నికల్‌గా సమస్యలు ఉంటే యూనియన్ సభ్యులు జిల్లా, రాష్ట్ర యూనియన్ సభ్యులతో టెక్నికల్ సపోర్టు తీసుకోవాలని ఏపీ ఎలక్ట్రానిక్, టీవీ మెకానిక్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుసేన్‌బాషా సూచించారు. ఆదివారం స్థానిక బీకే పల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీవీ మెకానిక్స్ సంఘటితం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ యూనియన్‌లో సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. అప్పుడే కుటుంబ సంక్షేమ నిధి ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి సభ్యుడు యూనియన్‌లో ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. రాజంపేట యూనియన్ కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం,మదనపల్లె యూనియన్ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ట్రైనింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో సృజనాత్మకత, ఆధునీకరణ పెరుగుతుందన్నారు. యూనియన్‌లో సభ్యులు కలిసి కట్టుగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సదుల్లా, నజీర్‌వుల్లా, హుసేన్ అలీఖాన్, చెన్నా, శ్రీనివాసులు, రెరెడ్డెప్పరెడ్డి, రమేష్, బాబు, హరి, ఫజుల్లా రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ హుసేన్ బాషా

## కలికిరి తహసీల్దారుగా మహేశ్వరి నియామకం

కలికిరి, ఆగస్టు 4: కలికిరి తహసీల్దారుగా ఎస్.మహేశ్వరీ బాయిని నియమిస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో పనిచేసిన పి.విజయ కుమారిని తిరిగి అనంతపురం జిల్లాకు పంపించగా ప్రస్తుతం ఖాళీగా వున్న ఈ స్థానంలో మహేశ్వరిని నియమించారు. కాగా గత ఐదేళ్లుగా మండలానికి మహిళా తహసీల్దార్లనే నియమించడం విశేషంగా వుంది. వైసీపీ ప్రభుత్వంలో చంద్రమ్మ, రమణి, చివరగా భాగ్యలత ఇక్కడ తహసీల్దారుగా పనిచేయగా అనంతరం ఎన్నికల సమయంలో విజయకుమారిని నియమించారు. ప్రస్తుతం కొత్త టీడీపీ ప్రభుత్వంలో కూడా మహిళా తహసీల్దారునే నియమించారు. ఎన్నికల ముందు వరకూ సంబేపల్లె తహసీల్దారుగా పని చేశారు. గతంలో చంద్రమ్మ కూడా సంబేపల్లె నుంచే ఇక్కడికి బదిలీ కావడం జరిగింది.

## పీలేరు తహసీల్దారుగా భీమేశ్వర రావు

పీలేరు, ఆగస్టు 4: పీలేరు నూతన తహసీల్దారుగా భీమేశ్వర రావు నియమితుల య్యారు. గతంలో కురబలకోట తహసీల్దారుగా పనిచేస్తుండిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా కడప జిల్లా ప్రొద్దుటూరుకు వెళ్లారు. ఎన్నికలు పూర్తయిన తరువాత చేపట్టిన బదిలీల్లో ఆయన పీలేరుకు నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.



## మదనపల్లెకు ఖాజాబీ..

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4: మదనపల్లె తహసీల్దార్‌గా కె. ఖాజాబీ నియమితులైనట్లు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె గతంలో ఎన్నికల ముందు గుర్రంకొండ తహసీల్దార్‌గా పని చేశారు. ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లా బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం మదనపల్లె తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టనుంది.

## బి.కొత్తకోట తహసీల్దార్‌గా శ్రీధర్‌రావు

బి.కొత్తకోట, ఆగస్టు 4: బి.కొత్తకోట మండల తహసీల్దార్‌గా బి.శ్రీధర్‌రావు నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లాలోని 9 మండలాలకు నూతన తహసీల్దార్లను నియమించినట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతకాలం ఇక్కడ ఎన్నికల బదిలీ భాగంగా అనంతపురం నుంచి వచ్చిన పుణ్యవతి విధులు నిర్వహిస్తూ ఇటీవలే స్వంత స్థలానికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

## మహతి ఫార్మసీ కళాశాలకు యూజీసీ అటానమస్

మదనపల్లె టౌన్, ఆగస్టు 4: మండలంలోని సీటీఎంలో ఉన్న మహతి ఫార్మసి కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ ఇచ్చింది. ఈ మేరకు యూజీసీ డిప్యూటీ సెక్రెటరీ గోపిచంద్ ఉత్తర్వులు జారీ చేశారని కళాశాల చైర్మన్ ఎస్. అమరనాథరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న తమ కళాశాలకు ఇప్పటికే న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు వుండగా, అటానమస్‌తో బీ-ఫార్మసి, ఎం-ఫార్మసి, డీ-ఫార్మ కోర్సుల్లో మరింత ఉత్తమ బోధనలు అందిస్తామన్నారు.

## డీఎస్పీని కలసిన పురప్రముఖులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 4: మదనపల్లె డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డి.కొండయ్య నాయుడును పలువురు పురప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయం ఆవరణలో డీఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం ఆయనను టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్, పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు కలసి పుష్పగుచ్చాలు అందజేశారు.



డీఎస్పీ కొండయ్యానాయుడును మర్యాదపూర్వకంగా కలసిన పోర్డు సిబ్బంది

## ఆకట్టుకున్న ఫ్రెండ్‌షిప్ డే సంబరాలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 4: మదనపల్లె పట్టణం విజయనగర్ కాలనీలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా చిన్నారులు సంబరా లు చేసుకున్నారు. ఐద్వా నాయకురాలు ఎం. భాగ్యమ్మ ఆధ్వర్యంలో చిన్నారులను చేరదీసి చేతికి బ్యాండ్లు కట్టి స్నేహితుల దినోత్స వం శుభాకాంక్షలు తెలుపుకున్నా రు. ఈ కార్యక్రమంలో రెడ్డిప్రసన్న, భాను, గాయత్రి, చిన్నారు లు పాల్గొన్నారు.

**బి.కొత్తకోట:** బి.కొత్తకోటలోని వాసవీక్లబ్ కార్యాలయంలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే ను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా గతంలో వాసవీక్లబ్, వాసవీ వనితాక్లబ్‌లకు అధ్యక్షులుగా పనిచేసిన వారిని సన్మానించారు. పరస్పరం ఫ్రెండ్‌షిప్‌డే శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



బ్యాండ్లు కడుతున్న చిన్నారులు

## సౌత్‌జోన్ హాకీ టోర్నమెంట్‌కు మదనపల్లె క్రీడాకారుడు

మదనపల్లె టౌన్, ఆగస్టు 4: బెంగ ళూరులో నిర్వహించనున్న సౌత్ జోన్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌కు మదనపల్లె క్రీడాకారుడు ఎస్.అఖిల్ వెంకట్ ఎంపికయ్యాడని అన్నమ య్య జిల్లా హాకీ అసోసియేషన్ అ ధ్యక్ష, కార్యదర్శులు పి.వి.ప్రసాద్, బి.శివప్రసాద్ తెలిపారు. కేరళ రాష్ట్రం కొల్లాంలో నిర్వహించిన సౌత్‌జోన్ సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొన్న వి.బాలాజి ప్రతిభను గుర్తించి పులివెందులలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఎంపిక చేశారన్నారు.

## మదనపల్లె మహాధర్నాను విజయవంతం చేయండి

పీలేరు, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సోమవారం మదనపల్లెలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని మాల విద్యార్థుల సంఘం రాయలసీమ అధ్యక్షులు మాలతోటి నరేశ్ పిలుపునిచ్చారు. మహాధర్నా సన్నాహకాల్లో భాగంగా ఆదివారం పీలేరు మండలంలోని పలు దళితవాడల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బాలంవారిపల్లె పంచాయతీ నాలేవాండ్లపల్లెలో ప్రజలతో ఆయన మాట్లాడుతూ అన్నదమ్ముల్లాంటి మాలలు, మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు కొన్ని మనువాద పార్టీలు ఆడుతున్న నాటకంలో భాగంగా సుప్రీం కోర్టు తీర్పును చూడాలన్నారు. వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని గతంలో తీర్పునిచ్చిన సుప్రీం కోర్టు ద్వారానే ఆ పార్టీలు నేడు అనుకూలంగా తీర్పును తెచ్చుకున్నాయన్నారు. సుప్రీం కోర్టును వ్యతిరేకిస్తూ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం ఆధ్వర్యంలో సోమవారం మదనపల్లె సబ్-కలెక్టర్ కార్యాలయం ముందు మహా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. పీలేరు మండలంలోని మాలలు పెద్దఎత్తున మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొని సుప్రీం కోర్టు తీర్పుపై ఉన్న వ్యతిరేకతను చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల విద్యార్థి సంఘం నేతలు వినోద్, శివ, హేమంత్ కుమార్, రూపేష్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



నాలేవాండ్లపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న మాలతోటి నరేశ్

**మదనపల్లె అర్బన్:** ఎస్సీవర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సోమవారం మాలమహానాడు ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తునట్లు మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం తెలిపారు. 25 ఏళ్లుగా వర్గీకరణ జరగాలని మాదిగ సామాజిక వర్గం సహేతుకమైనది కాదు. దళితులను విడదీయడమే కాకుండా ఓట్ల రాజకీయం మన రాజ్యాంగానికి విరుద్ధ మన్నారు. మాలలందరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.